సిద్దిపేట జిల్లా గౌరవెల్లి ప్రాజెక్టు నీటి నుంచి జేసీబీ సాయంతో బయటకు తీసిన డీసీఎం. ఇన్‌సెట్‌లో గౌరవెల్లి ప్రాజెక్టులో మునిగిన డీసీఎం

# కొంపముంచిన గూగుల్ మ్యాప్

- గౌరవెల్లి ప్రాజెక్టు నీళ్ల లోకి వెళ్లిన డీసీఎం
- ఈదుకుంటూ బయటపడిన డ్రైవర్

అక్కన్నపేట, డిసెంబర్ 10: ఓ ఐడియా జీవితాన్ని మారుస్తుందో లేదో గానీ గూగుల్ మ్యాప్ మాత్రం ఓ వ్యాన్ డ్రైవర్‌ను ఆగం చేసింది. గూగుల్ మ్యాప్ సాయంతో చేస్తున్న ప్రయాణం కాస్తా ప్రాజెక్ట్ నీటిలోకి తీసుకెళ్లింది. బాధిత డ్రైవర్ రాజేందర్, క్లీనర్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లిలోని ములకనూరు స్వకృషి మహిళా పాల డెయిరీకి సంబంధించిన పాల కవర్ల తుక్కును శనివారం రాత్రి డ్రైవర్ డీసీఎంలో లోడ్ చేసుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు. ములకనూరు నుంచి వయా హుస్నాబాద్, రామవరం, కొమురవెల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు గూగుల్ మ్యాప్‌ను అనుసరించాడు. హుస్నాబాద్ దాటిన తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టు బైపాస్ రోడ్డు సమీపంలో నందారం క్రాస్ రోడ్డు వద్ద దారి అర్థంకాకపోవడంతో ఎడమవైపు వెళ్లాల్సిన వ్యాన్‌ను కుడివైపు తిప్పడంతో గూగుల్ మ్యాప్ సైతం అటే హైదరాబాద్‌కు దారి చూపించింది. అదే సరైన రోడ్డు అనుకొని ముందుకు వెళ్లగా.. వ్యాన్ నేరుగా ప్రాజెక్టు నీటిలోకి వెళ్లింది. డీసీఎం అప్పటికే సగం వరకు మునగడంతో భయపడి నిలిపివేశాడు. కిందికి దిగి చూసే సరికి చుట్టూ నీళ్లు ఉండటంతో ఈదుకుంటూ బయటకు వచ్చాడు. ఆదివారం ఉదయం స్థానికుల సాయంతో జేసీబీతో డీసీఎం వాహనాన్ని నీళ్ల నుంచి బయటకు తీయడంతో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లాడు. గూగుల్ మ్యాప్‌ను నమ్మితే కొంపమునిగిందంటూ డ్రైవర్ రాజేందర్ వాపోయాడు.

## నిరుద్యోగుల ఆత్మహత్యల్లో

# మహారాష్ట్ర టాప్

## దేశంలో రోజుకు 10 మంది బలవన్మరణం

- కర్ణాటకలోనూ వందల్లో మరణాలు
- మూడేండ్లలో 13 శాతం తగ్గుదల
- తెలంగాణలో నిరుడు 70 శాతం తగ్గుముఖం
- పుదుచ్చేరి, లక్షద్వీప్‌లో ఒక్కటీ లేదు
- వెల్లడించిన కేంద్ర ప్రభుత్వ నివేదిక



హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగం యువతకు శాపంగా మారుతున్నది. మరణశాసనాన్ని రాస్తున్నది. దేశంలో ప్రతి రోజు సగటున 10మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు కేంద్రం లోక్‌సభలో వెల్లడించింది. 2020-22 మధ్య మూడేండ్ల కాలంలో దేశవ్యాప్తంగా 10,259 మంది నిరుద్యోగం కారణంగా ప్రాణాలు వదిలారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ నిరుద్యోగుల ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదైన ఆత్మహత్యల్లో 20 శాతం ఒక్క మహారాష్ట్రలోనే జరుగుతున్నాయి. ప్రతి ఐదింటిలో ఒకటి ఇక్కడే నమోదువుతున్నది. కర్ణాటక, తమిళనాడు వరుసగా రెండు, మూడుస్థానాల్లో ఉన్నాయి.

### తెలంగాణలో 70 శాతం తగ్గుదల

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంతరాష్ట్రం గుజరాత్ నిరుద్యోగుల ఆత్మహత్యల్లో నాలుగో స్థానంలో ఉంది. పైన చెప్పుకున్న కాలవ్యవధిలో ఇక్కడ 811 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. ఇక్కడ ఈ మూడేండ్లలో 60 మంది మాత్రమే ప్రాణాలు తీసుకున్నారు. 2020లో 23 మంది, 2021లో 28 మంది, 2022లో 9 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అంతకుముందు ఏడాదితో అంటే 2021తో పోల్చితే ఆత్మహత్యల్లో 70 శాతం తగ్గుదల కనిపించింది. దేశంలోని 28 రాష్ట్రాలతో పోల్చినప్పుడు తెలంగాణ స్థానం 20గా ఉంది.

### ఆశ్చర్యపరుస్తున్న బీహార్

రాష్ట్రాలపరంగా మణిపూర్‌లోఅతి తక్కువగా రెండు మరణాలు మాత్రమే నమోదు కాగా, నాగాలాండ్‌లో 8, అరుణాచల్‌ప్రదేశ్‌లో 12 మంది ప్రాణాలు తీసుకున్నారు. ఈ జాబితాలో అన్నింటి కంటే ఆశ్చర్యపరిచిన రాష్ట్రం బీహార్. పేదరికం, నిరుద్యోగం తాండవించే ఇక్కడ 17 మంది మాత్రమే మరణించారు. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా దొరికిన పని చేసుకునే అలవాటు వల్లే ఇక్కడ ఆత్మహత్యలు తక్కువని నిపుణులు చెప్తున్నారు. యూపీలో 499 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు.

### కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ అదే తీరు

దేశంలోని 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆరింటిలో ఆత్మహత్యలు నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ మూడేండ్లలో 698 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఒక్క ఆత్మహత్య కూడా నమోదు కాలేదు. అండమాన్, నికోబార్ దీవులతోపాటు లడఖ్‌లో గతేడాది ఒక్కోటి చొప్పున మరణాలు నమోదయ్యాయి.




### నిరుద్యోగుల ఆత్మహత్యల్లో టాప్-5 రాష్ట్రాలు

(మూడేండ్లలో ఆత్మహత్యలు)




## లోకం పోకడ

### ప్రియురాలితో పెండ్లి కోసం పుట్టినరోజే లింగమార్పిడి

**పురుషుడిగా మారిన 47 ఏండ్ల మహిళ**

ఇండోర్: ప్రేమించిన అమ్మాయిని పెండ్లి చేసుకోవడం కోసం ఓ మహిళ తన 47వ పుట్టిన రోజునాడు లింగ మార్పిడి చేయించుకుని పురుషుడిగా మారారు. వీరి పెండ్లి ఈ నెల 11న జరుగబోతున్నది. వీరిద్దరూ స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం పెండ్లి చేసుకుని, ఫ్యామిలీ కోర్టు నుంచి వివాహ ధ్రువపత్రాన్ని గురువారం స్వీకరించారు. ఆస్తా, అల్కా సోని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందినవారు. అల్కా జన్మతః స్త్రీ. అయితే కొన్నేండ్ల తర్వాత తాను స్త్రీని కాదని, పురుషుడిననే భావన ఆమెకు కలిగింది. అప్పటి నుంచి ఆమె తన పేరు అస్తిత్వగా మార్చుకొన్నది. అస్తిత్వ సోదరితో ఆస్తాకు స్నేహం ఉంది. దీంతో ఆస్తా ఆ అన్నా చెల్లెళ్ల ఇంటికి వెళ్తూ ఉండేవారు. వీరి పరిచయం ప్రేమగా మారింది. వీరి పెండ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించాయి.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 12.8°c | 32.9°c |
| ఆదిలాబాద్ | 13.7°c | 29.3°c |
| మెదక్ | 14.7°c | 32.2°c |
| కరీంనగర్ | 16.0°c | 28.0°c |
| నిజామాబాద్ | 16.7°c | 30.3°c |
| హైదరాబాద్ | 16.7°c | 29.6°c |
| వరంగల్ | 17.0°c | 29.0°c |
| ఖమ్మం | 18.0°c | 28.0°c |
| నల్లగొండ | 18.0°c | 33.9°c |
| మహబూబ్‌నగర్ | 19.5°c | 31.5°c |

### కిటకిటలాడిన వేములవాడ

కార్తీకమాసం ముగుస్తుండటంతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న సన్నిధి భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించారు. దాదాపు 2 గంటలపాటు క్యూలైన్లలో నిలబడి కోడె మొక్కు చెల్లించుకున్నారు. సుమారు 40 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. - వేములవాడ టౌన్

సిక్కింలోని పంగలోఖ వన్య ప్రాణుల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన పులి

## 3,640 మీటర్ల ఎత్తులో బెంగాల్ టైగర్

### అంత ఎత్తులో తిరగడం అరుదన్న పరిశోధకులు

గ్యాంగ్‌టక్, డిసెంబర్ 10: సిక్కింలోని పంగలోఖ వన్య ప్రాణుల అభయారణ్యంలో 3,640 మీటర్ల ఎత్తులో ఒక బెంగాల్ టైగర్ కనిపించిందని అధికారులు తెలిపారు. సిక్కిం, బెంగాల్, భూటాన్‌ల కేంద్రంగా ఉన్న ఈ వన్య ప్రాణుల అభయారణ్యం 128 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. సిక్కింలోనే అతి పెద్దదైన ఈ అభయారణ్యంలో జంతువులపై పరిశోధనలు సాగించే బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెమెరాలకు ఈ బెంగాల్ టైగర్ చిక్కింది. ఒక టైగర్ 3,640 మీటర్లు (11,942 అడుగులు) ఎత్తులో కన్పించడం ఇదే ప్రథమమని వెల్లడించారు. సిక్కిం హిమాలయాలలోని ఇంత ఎత్తయిన ప్రదేశంలో టైగర్ కదలికలు చూస్తుంటే పులి సంచారం గురించి లోతైన అవగాహన అవసరమని, అంతేకాకుండా దీనిపై మరింత విస్తృత పరిశోధనలుచేపట్టాలని అవగతమవుతున్నదని పరిశోధకులు అథర్వసింగ్ అభిప్రాయపడ్డారు.

# ఇది ఒక జీబీ కథ



మొదటిపేజీ తరువాయి...

డాలర్ల మధ్య ఉండేది. ఇప్పుడు భారత కరెన్సీలో చెప్పాలంటే రూ.67 లక్షల నుంచి రూ.1.18 కోట్లు అన్నమాట. కానీ ఇప్పుడు.. రెండుమూడు సెంటీమీటర్ల పరిమాణం ఉన్న చిప్‌లో వందట జీబీల డాటా పడుతున్నది. నాలుగైదువందల రూపాయలు పెడితే పదుల జీబీ పెన్ డ్రైవ్‌లు వస్తున్నాయి. పెరిగిన టెక్నాలజీ నా పరిమాణాన్ని, నా విలువను కుదించింది. ఇప్పుడు రూ.2-3వేలు ఖర్చు పెడితే 1టీబీ హార్డ్ డిస్క్ వస్తున్నది. అంటే వెయ్యి జీబీలు.. ఈ లెక్కన నా విలువ రూ.కోటి నుంచి రెండు రూపాయలకు పడిపోయింది. మొదట్లో హార్డ్ డిస్క్‌లకే పరిమితమైన నేను.. క్రమంగా ఫోన్లలోకి కూడా ప్రవేశించాను. మొదటిసారి 1 జీబీ స్టోరేజీ సామర్థ్యంతో ఒక ఫోన్ ఎప్పుడు విడుదలైందో తెలుసా?. మొటరోలా సంస్థ 2011లో మొదటిసారి 1 జీబీ ఫోన్‌ను విడుదల చేసింది. అప్పుడు అదో సంచలనం. ఇప్పుడు కనీసం 6 జీబీ ర్యామ్.. 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ ఉంటేనే ఆ మ్యోన్నారు. డల్ వైపు కన్నెత్తి చూసు

### ధర తగ్గి.. వాడకం పెరిగింది.

నన్ను డాటా ట్రాన్స్‌ఫర్‌ను కొలిచేందుకు కూడా వాడుతారు. సులభంగా చెప్పాలంటే ఇంటర్నెట్ వేగం, వినియోగాన్ని కొలిచేందుకు కూడా వాడుతారని తెలిసిందే. నెట్ వాడాలంటే అందరూ డాటా ప్యాకేజీలు వేసుకుంటున్నారు కదా.. ఇప్పుడు సగటున కనీసం రోజుకు 1 జీబీ ఇంటర్నెట్ వచ్చే ప్యాకేజీ వేసుకుంటున్నారు. సగటున ఇప్పుడు ఒక జీబీ డాటాకు చేస్తున్న ఖర్చు కేవలం రూ.9.94 మాత్రమే.. అంటే ఒక చాయ్‌కి చేసే ఖర్చుతో ఒక జీబీ డాటా వస్తున్నది. కానీ.. ఒకప్పుడు పరిస్థితి ఎలా ఉండేదో తెలుసా.. దశాబ్దం కింద నా విలువ తెలిస్తే మీరు నోరు వెళ్లబెట్టడం ఖాయం. 2014లో సగటున ఒక జీబీ డేటా ఖరీదు ఏకంగా రూ.269. దీంతో బంగారం కన్నా జాగ్రత్తగా నెట్ వాడిన రోజులవి. అప్పట్లో నెలకు సగటున ఎంత డాటా వాడేవారో తెలుసా.. 0.8 జీబీ. అంటే ఇప్పుడు ఒక్క రోజులో వాడే డాటా అప్పుడు నెలంతా వచ్చేది. ఇప్పుడు సగటున నెలకు 20 జీబీ వాడుతున్నారు. నా ధర తగ్గి.. వాడకం పెరిగిందన్నమాట.

### ఎలా పెరిగింది?

నా ధర తగ్గింది.. వేగం పెరిగింది.. అందరూ జీబీలకు జీబీలు వాడుతున్నారు.. ఇదంతా బాగుంది.. మరి ఇదంతా ఎలా సాధ్యం అయ్యిందో కూడా తెలుసుకోవాలిగా.. శాటిలైట్ నుంచి వచ్చే సిగ్నల్‌ను రేడియోలకు అందించే స్టేషన్ల మాదిరిగా.. మీకు ఇంటర్నెట్‌ను అందించేందుకు 'బేస్ ట్రాన్స్-రిసీవర్స్ స్టేషన్'లు (బీటీఎస్) ఉంటాయి. ఇవి ఎంతగా పెరిగితే అంతగా ఇంటర్నెట్ కనెక్టివిటీ, వేగం పెరుగుతుంది. దశాబ్దం కిందట దేశంలో 6.49 లక్షల బీటీఎస్‌లు ఉంటే.. ఇప్పుడు ఏకంగా 25.42 లక్షలకు పెరిగాయి. అంటే నాలుగు రెట్లు పెరిగాయి. అందుకే ఇంటర్నెట్ కనెక్టివిటీ, వేగం పెరిగాయి. దశాబ్దం కింద డాటా వేగం 1.30 ఎంబీపీఎస్ (ఎంబీ పర్ సెకన్) ఉంటే.. ఇప్పుడు ఏకంగా 75.80 ఎంబీపీఎస్‌కు పెరిగింది. అంటే వేగం 70 రెట్లకుపైగా పెరిగింది. బీటీఎస్‌లు పెరుగడంతో దేశంలో 6.44 లక్షల గ్రామాలుంటే 6.16 లక్షల ఊళ్లకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. కనెక్టివిటీ పెరగడంతో యూజర్లు పెరిగారు. దశాబ్దం కింద ఇంటర్నెట్‌ను 25 కోట్ల మంది వాడితే ఇప్పుడు యూజర్ల సంఖ్య 88 కోట్లు దాటింది.

| సంవత్సరం | బీటీఎస్‌ల సంఖ్య | డాటావేగం | ఇంటర్నెట్ యూజర్స్ సంఖ్య |
|---|---|---|---|
| 2013 | 6.49 లక్షలు | 1.30 ఎంబీపీఎస్ | 25 కోట్లు |
| 2023 | 25.42లక్షలు | 75.80 ఎంబీపీఎస్ | 88 కోట్లు |

### కనుమరుగవుతూ.. మళ్లీ వెలుగులోకి..

ఇంటర్నెట్, డాటా వినియోగం పెరగడంతో.. మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు అంటూ అందరూ డాటాను ట్రాన్స్‌ఫర్ చేయడం, నిల్వ చేయడం బాగా పెరిగిపోయింది. క్రమంగా నా పేరును మర్చిపోతున్నారు. నిల్వ సామర్థ్యం క్రమంగా 'జీబీ'ల నుంచి టీబీల్లోకి మారిపోతున్నది. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఎప్పుడో నన్ను విడిచిపెట్టి 'టీబీ జనరేషన్'లోకి మారిపోయాయి.. ఇప్పుడు ఫోన్లు కూడా జీబీయన్ల నుంచి 'టీబీయన్లు'గా మారిపోతున్నాయి. మరో నాలుగైదేండ్లలో నన్ను ర్యామ్ కెపాసిటీ కోసమే వాడుతారు. స్టోరేజీ రంగంలో నా కథ తుది దశకు చేరినట్టే. అయితే, ఇంటర్నెట్ స్పీడ్ గురించి చెప్పేటప్పుడు మాత్రం నా పేరు మార్మోగే రోజులు వస్తున్నాయి.. ఇప్పుడు స్పీడ్ ఎంబీపీఎస్‌లో ఉన్నది.. త్వరలో 'జీబీపీఎస్'కు మారనున్నది. అప్పుడు మళ్లీ అందరూ నా నామస్మరణ చేయాల్సిందే.. ఇదీ నా 'ఒక జీబీ' కథ.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

- రెండు ఆటోలు ఢీకొనడంతో ఘటన
- సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో విషాదఛాయలు

కొమురవెల్లి/జగదేవ్‌పూర్, డిసెంబర్ 10 : రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన 12 మంది కూలీలు ఉదయం ఆటోలో జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి పత్తి ఏరేందుకు వెళ్లారు. పని ముగించుకొని తిరిగి ఆటోలో పయనమయ్యారు. జగదేవ్‌పూర్ మండలం మునిగడప-వట్టిపల్లి మధ్యలో ఆటో డ్రైవర్ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వైనాల శిరీష(17), పుట్ట జయమ్మ (58) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్ తేలు మహేశ్‌తో పాటు బాలనర్సవ్వ, లచ్చమ్మ, జానాబాయి, దాసరం లక్ష్మి, మల్లవ్వ, కనకవ్వ, గుర్రాల లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని గజ్వేల్ ప్రభుత్వ దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ గుర్రాల లక్ష్మి, మల్లవ్వ మరణించారు. దాసరం లక్ష్మి, బోయిన కనకవ్వలను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

దేవరకొండ దవాఖాన వద్ద ఆందోళన చేస్తున్న మృతుడు సూర్యనాయక్ కుటుంబసభ్యులు

## గిరిజనుడి లాకప్‌డెత్!

మొదటిపేజీ తరువాయి...

మార్చురీలో భద్రపరిచారు. పోలీసులు కొట్టడం వల్లే సూర్యనాయక్ చనిపోయాడని ఆరోపిస్తూ అతడి బంధువులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు ఎస్పీ అపూర్వరావు తెలిపారు. ఎస్సై సతీశ్‌రెడ్డిని ముందుగా నల్లగొండ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్టు ఎస్పీ పేర్కొనడంతో వారు ఆందోళన విరమించారు. సూర్యనాయక్‌ను విచారిస్తుండగా బీపీతో పడిపోయాడని ఎస్సై సతీశ్‌రెడ్డి తెలిపారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### యూకో బ్యాంక్‌లో..

**యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ లిమిటెడ్ (యూకో)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 142
- పోస్టులు: అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 27
- వెబ్‌సైట్: https://ucobank.com/web/guest/job-opportunities

### ఐసీఏఐలో...

**ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 11
- పోస్టులు: సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 5
- వెబ్‌సైట్: http://www.icmai.in

### బీఈఎంఎల్ లిమిటెడ్‌లో...

**ప్రభుత్వ సంస్థ బీఈఎంఎల్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 33
- పోస్టులు: కన్సల్టెంట్/నేవీ మారిటైం బిజినెస్, డీజీఎం (హెచ్ఆర్), రాజభాష ఎగ్జిక్యూటివ్ అండ్ అడ్మిన్ ఆఫీసర్ ట్రెయినీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 27
- వెబ్‌సైట్: www.bemlindia.

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, ఐఐటీ నీట్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.